క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందిస్తున్న ఎమ్మెల్యే సత్యం

మల్యాల: మండలంలోని రాజారం గ్రామానికి చెందిన శివరాత్రి గంగారాజం అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల కోసం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను సంప్రదించగా, తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు రూ.2లక్షల ఎల్ వోసీని శుక్రవారం అందజేశారు. ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బత్తిని మల్లేశ్వరిశ్రీనివాస్ గౌడ్,జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్, యూత్ కాంగ్రెస్ మల్యాల మండలాధ్యక్షుడు శనిగరపు తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

బిల్ కలెక్టర్ల సహకారంతోనే రాష్ట్రస్థాయి గుర్తింపు



బిల్ కలెక్టర్లను సన్మానిస్తున్న కమిషనర్

రాయికల్: బిల్ కలెక్టర్ల సహకారంతోనే రాయికల్ మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయి గుర్తింపు వచ్చిందని మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ అన్నారు. పన్నుల వసూళ్లలో ప్రతిభ కనబర్చిన బిల్‌కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు, సహాయక సిబ్బందిని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్ను వసూళ్లలో టాప్‌లో నిలవడంతో పట్టణాభివృద్ధికి రూ.1.20 కోట్లు మంజూరు చేశారని గుర్తుచేశారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను ఎర్లీబర్డ్ స్కీం కింద 33.57 శాతం ఇంటి పన్ను వసూలైందని గుర్తుచేశారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటి, ఆర్ఐ అశోక్, బిల్ కలెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాల సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్, ఇబ్రహీంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 2 నుంచి విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఈ శిబిరాలను మండల విద్యాధికారి మధు సందర్శించారు. విద్యార్థులకు ఇస్తున్న యోగా, ఎక్సైజ్, స్పోకేన్ ఇంగ్లిష్, వేదిక్ మ్యాథ్స్ శిక్షణ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శిక్షణ శిబిరాల ఇన్‌చార్జి రవీందర్, రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్‌లో వ్యవసాయ, హార్టీకల్చర్ అధికారులు ఆయిల్‌పాం సాగుపై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు.ఆయిల్‌పాం సాగు చేసేందుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని రాయితీపై మొక్కలు, డ్రిప్ పరికరాలు అందిస్తుందన్నారు. ఆయిల్‌ఫామ్ సాగుతో రైతులు అదిక లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో గుగ్గిళ్ల సురేశ్ గౌడ్, ఏఈఓ శ్రీహరి, హార్టీకల్చర్ అధికారి రజిత, కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు లింబాద్రి, రైతులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లులో తనిఖీ

సారంగాపూర్: మండలంలోని బట్టపల్లి గ్రామ శివారులోని రైస్‌మిల్లును సివిల్‌సప్‌లై అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రైస్‌మిల్లు నిర్వాహణపై జిల్లా కలెక్టర్‌కు అందిన ఫిర్యాదు మేరకు అధికారులు తనిఖీ చేపట్టి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. మిల్లులోని ధాన్యం నిల్వలు, బియ్యం నిల్వలపై విచారణ నిర్వహించినట్లు తెలిసింది. దీనిపై సివిల్ సప్లై అధికారులను వివరణ కోరగా నివేదికను కలెక్టర్‌కు అందించినట్లు తెలిపారు.

కుక్కల వీరంగం.. కోతుల హంగామా

- కుక్కలు,కోతులతో భయం భయం
- ఇబ్బందులు పడుతున్న జనం
- దాడులతో ప్రజల బెంబేలు



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

మెట్‌పల్లిరూరల్: గ్రామాల్లో కుక్కలు,కోతుల బెడద రోజురోజుకు పెరుగుతోంది. గుంపులు గుంపులుగా చేరి హంగామా సృష్టిస్తున్నాయి. వీధుల్లో కుక్కల వీరంగం,ఇళ్లలో కోతుల విధ్వంసంతో జనం బెంబెలెత్తిపోతున్నారు. కుక్కలు,కోతుల సంఖ్య అంతకంతకు పెరుగుతుండడం, దాడులకు తెగబడుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తరచూ ఏదో ఓ చోట కుక్కలు, కోతుల దాడుల్లో గాయాలపాలవుతుండడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

పెరుగుతున్న కుక్కల,కోతుల బెడద

మెట్‌పల్లి మండలంలోని 23 గ్రామాల్లో కొన్ని గ్రామాలను మినహాయిస్తే మిగతా గ్రామాల్లో కుక్కలు,కోతుల బెడద తీవ్రంగా ఉంది.వీటి సంఖ్య గణనీయంగా పెరిగింది. రహదారులపై వెళ్లే వారిపై వెంట పడి దాడులకు పాల్పడుతున్నాయి. గుంపులు గుంపులుగా చేరి ప్రజలను నానా అవస్థలు పెడుతున్నాయి.దీంతో ఇళ్ల నుంచి బయటికి రావాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు మేకలు,గొర్రెల మందలపై సైతం దాడులకు పాల్పడడంతో నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కలు,కోతుల బెడద అధికారులకు ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి. గ్రామాల్లోని రాజకీయ పార్టీల నేతలకు సైతం ప్రజలు మొరపెట్టుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కుక్కలు,కోతుల బెడదను నియంత్రించే విషయంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు

- మెట్‌పల్లి మండలం కోనరావుపేటలో నెలన్నర క్రితం జరిగిన కుక్కల దాడిలో ఐదుగురు వ్యక్తులు, అంతకుముందు జరిగిన దాడిలో ఆరుగురు గాయాలపాలయ్యారు.
- వేంపేటలో కొన్నిరోజుల క్రితం ఓ కాలనీలో కోతులు ఇళ్లలో చొరబడి విధ్వంసం చేయడంతో పాటు పలువురిపై దాడులు చేయగా గాయాలయ్యాయి.
- వేంపేటలో గొర్రెలు,మేకల మందపై కుక్కలు దాడి చేయగా 16 గొర్రెలు మృతి చెందగా, 8 మేకలకు గాయాలయ్యాయి.
- పైవన్నీ ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు మాత్రమే.ఇవే కాకుండా చాలా ప్రాంతాల్లో కుక్కలు,కోతుల దాడుల్లో గాయపడ్డవారు ఎంతో మంది ఉన్నారు.

కుక్కలు,కోతుల బెడద ఎక్కువగా ఉంది



గ్రామాల్లో కుక్కలు,కోతులు హల్‌చల్ చేస్తున్నాయి.వీటి బెడదతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది.కుక్కలు,కోతుల బెడదను అరికట్టేలా అధికారులు దృష్టి సారించాలి.

–గన్నారపు శంకర్,వేంపేట

చికిత్స కోసం వస్తున్నారు



కుక్కలు,కోతుల దాడుల్లో గాయపడ్డ వారు చికిత్స కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్నారు. వారికి కావాల్సిన వైద్యం అందిస్తున్నాం. ఈ మధ్య కాలంలో ఇలాంటి కేసులు ఎక్కువగానే వస్తుండడం గమనించాం. కుక్కలు, కోతుల దాడుల్లో గాయపడితే ఆలస్యం చేయకుండా ఆస్పత్రికి వచ్చి చికిత్స తీసుకోవాలి.

–అంజిత్‌రెడ్డి, మెట్‌పల్లి మండల వైద్యాధికారి

భారత సైన్యానికి మద్దతుగా ర్యాలీలు



జగిత్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు



పెగడపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

జగిత్యాలటౌన్: ఉగ్రవాదులపై సిందూర్ ఆపరేషన్ నిర్వహిస్తున్న భారత సైన్యానికి సంఘీభావంగా శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాచకొండ శ్రీరాములు మాట్లాడుతూ పాకిస్తాన్ ప్రేరేపిత తీవ్రవాదులు పర్యాటకులపై దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అందె మారుతి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ముస్లింల సంబరాలు

భారత సైన్యం జరిపిన ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై హర్షం వ్యక్తం చేసిన ముస్లింలు సైనికులకు సెల్యూట్ చేసి టవర్ సర్కిల్‌లో శుక్రవారం మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు మీర్ కాజింఅలీ, ముజిబుద్దీన్, ముకస్సీర్ అలీ నేహాల్, సలాఉద్దీన్, పాల్గొన్నారు.

పెగడపల్లి: ఉగ్రవాద నిర్మూలనకు పోరాడుతున్న భారత సైన్యానికి మద్దతుగా మండలంలోని బతికపల్లి, పెగడపల్లి గ్రామాల్లో యువకులు శుక్రవారం సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని బతికపల్లి నుంచి పెగడపల్లి వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ కూడలి వద్ద పాకిస్తాన్, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్మీ జవాన్ బూరుగు జలపతి, రిటైర్డ్ ఏఎస్సై కముటం మల్లయ్య, న్యాయవాది క్యాస రఘునందన్‌రెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు పల్లె మోహన్ రెడ్డి, యువకులు, స్థానికులు పాల్గొన్నారు.

సైన్యానికి మద్దతుగా పూజలు

కోరుట్ల: భారత సైనికులకు మద్దతుగా రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో, ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ యతిరాజం నర్సయ్య, ఈవో విక్రమ్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

రాయికల్: హనుమాన్ ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దాసరి గంగాధర్, పార్టీల పట్టణ అధ్యక్షులు మ్యాకల రమేశ్, కుర్మ మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య

గొల్లపల్లి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్య అందుతుందని గొల్లపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు అన్నారు. మండలంలోని అగ్గిమల్ల, గుంజపడుగు, గోవిందుపల్లి, చిల్వకోడూర్ గ్రామాల్లో పదో తరగతి విద్యార్థులను కలిసి తమ కళాశాలలో చేరాలని ప్రచారం చేశారు. కళాశాలలో చదివిన విద్యార్థులు ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలు, మెడికల్ కాలేజీలు, యూనివర్సిటీ క్యాంపస్‌లో సీట్లు సాధించారని తెలిపారు. కళాశాలలో ఉత్తమ బోధన, పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామని, కళాశాల చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు రమేశ్, రాం ప్రసాద్, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలి

కథలాపూర్: విద్యార్థులను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని ఎంఈవో లోకిని శ్రీనివాస్ కోరారు. మండలంలోని తక్కళ్లపెల్లి గ్రామంలో ఉపాధ్యాయులు శుక్రవారం ముందస్తు బడిబాట నిర్వహించారు. గ్రామంలోని ప్రధానవీధుల గుండా ర్యాలీ చేపట్టారు. విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతుల గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రవీందర్, భారతి, రవి, సీఆర్పీ విజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధిని వినియోగించుకోవాలి

జగిత్యాలరూరల్: సీఎం సహాయనిధిని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని కండ్లపెల్లి గ్రామానికి చెందిన గిద్దె స్వేచ్ఛ వినికిడి శస్త్ర చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.8 లక్షల ఎల్‌వోసీని శుక్రవారం అందించారు. కార్యక్రమంలో బోడ్ల జగదీష్,రాజు రవి, ప్రభాత్‌సింగ్, రాజు, రవిశంకర్, వంశీ పాల్గొన్నారు.

సాగులో మెలకువలపై అవగాహన

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని సారంగాపూర్, కందెనకుంట గ్రామాల్లో రైతులకు సాగు విధానంలో మెలకువలపై అవగాహన కల్పించారు. రైతులు యూరియా, ఇతర రసాయానిక మందులు, పురుగుల మందుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ పద్మజ, డాక్టర్ బి. శ్రీనివాస్, డాక్టర్ శ్రీనివాస్‌నాయక్, డాక్టర్ సాధ్వి రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు వెంకటేశ్, శిరీష, రైతులు పాల్గొన్నారు.

మల్యాల: మండలంలోని మానాలలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రైతులకు వివిధ పంటల సాగు, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రజనీకాంత్, సాయినాథ్, ఏవో కె.చంద్రదీపక్, ఏఈవోలు కారుణ్యకుమార్,శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

సైనికులకు ఉపాధి కూలీల సెల్యూట్



సైనికులకు జై కొడుతున్న ఉపాధి కూలీలు

సారంగాపూర్: పాకిస్థాన్‌తో యుద్ధం చేస్తూ, భారత్ రక్షణ కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి వీరోచితంగా పోరాటం చేస్తున్న భారత త్రివిధ దళాలకు శుక్రవారం ఉపాధిహామీ కూలీలు సెల్యూట్ చేశారు. మండలంలోని పెంబట్ల, రంగపేట, లక్ష్మీదేవిపల్లి, బట్టపల్లి గ్రామాల్లో కూలీలు, ఉపాధిహామీ సిబ్బంది జై జైవాన్, జై భారత్‌మాత అంటూ నినాదాలు చేశారు.

అమర జవాన్‌కు నివాళి

కథలాపూర్: వీర మరణం పొందిన అమర జవాన్ మురళీ నాయక్‌కు మండలంలోని భూషణరావుపేటలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, నాయకులు కొండా ఆంజనేయులు, బద్దం మహేందర్, కొత్తపెల్లి శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి, ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలోనే సురక్షిత ప్రయాణం

కోరుట్ల రూరల్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణమే సురక్షితంగా సుఖవంతంగా ఉంటుందని కోరుట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోరుట్ల బస్టాండ్ నుంచి హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు అంతకుముందు 2 బస్సులు నడిచేవని ప్రయాణికుల సంఖ్య పెరగటంతో ప్రస్తుతం 2 ఏసీ, 2 నాన్ ఏసీ బస్సులు,అదేవిదంగా కనిగిరి, పామూరు, కనిగిరి వింజామూర్‌కు 2 బస్సులు ఉండేవని ప్రస్తుతం 4 నాన్ ఏసీ బస్సులు నడుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రయాణికులకు ఆర్టీసీలోనే సురక్షిత ప్రయాణం ఉంటుందన్నారు. ఆర్టీసీని ఆదరించాలని పేర్కొన్నారు.

తల్లిదండ్రులను విస్మరిస్తే జైలుకే

కోరుట్ల: తల్లిదండ్రులను విస్మరిస్తే జైలుకు వెళ్లక తప్పదని కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం అవగాహన పోస్టర్, కరపత్రాలు, స్టిక్కర్లను ఆర్డీవో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో రాజమణి, కోరుట్ల డివిజన్ సీనియర్ సిటీజన్స్ అధ్యక్షుడు పబ్బా శివానందం, కార్యదర్శి రాజ్ మోహన్, కోశాధికారి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల పరిధిలో గ్రామాల్లో శనివారం సాయంత్రం 3.30 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఏఈ సుందర్ తెలిపారు.

మల్యాల: మండలంలోని మల్యాల, తక్కళ్లపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ దయానంద్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సామూహిక కుంకుమార్చన

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని సూర్యభగవాన్ ధనలక్ష్మీసహిత శ్రీదన్వంతరి ఆలయంలో శుక్రవారం మాతలు సామూహిక కుంకుమార్చన చేశారు. కుంకుమార్చనలో వందమంది మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు చిలుకముక్కు నాగరాజుశర్మ, విష్ణుశర్మ, ఆలయ ఫౌండర్ రాజన్న, ఆలయ అధ్యక్షుడు పాల్తెపు శంకర్ పాల్గొన్నారు.



రాయికల్: పట్టణంలోని అయ్యప్ప ఆలయం వద్ద కల్వర్టుకు ఇటీవల మరమ్మతు నిమిత్తం మున్సిపల్ సిబ్బంది తొలగించగా నేటి వరకు కల్వర్టు పైప్‌లైన్ బిగించకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా కమిషనర్ స్పందించి పైప్‌లైన్ మరమ్మతులు నిర్వహించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
మనోహర్ గౌడ్, కమిషనర్, రాయికల్ బల్దియా, సెల్ నం.: 891977785

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

కొనుగోళ్లు వేగవంతం చేయాలి



వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో శ్రీనివాస్

ఇబ్రహీంపట్నం: కొనుగోళ్లు వేగవంతం చేయాలని మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో ఇప్పటివరకు మిల్లులకు ఎంత ధాన్యం తరలించారు. తేమశాతం వచ్చినవి ఎంతమంది రైతులవి ఉన్నాయి, ఇంకా ధాన్యం విలువలు ఎన్ని ఉన్నాయి? వివరాలను తహసీల్దార్ ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాలు పడుతు న్నందునా ధాన్యం వెంటనే తరలించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఆర్ఐ రేంవత్‌రెడ్డి, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాన కూడళ్లలో అక్రమ షెడ్లను తొలగించాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఉన్న అక్రమ షెడ్లను తొలగించాలని భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు కోరారు. సంఘం నాయకులతో కలిసి శుక్రవారం బల్దియా కమిషనర్ స్పందనకు వినతిపత్రం అందించారు. అనంతరం రాజు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో ఎక్కడ పడితే అక్కడ రోడ్లకు అడ్డంగా షెడ్లను నిర్మించి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడేలా చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు. వెంటనే అక్రమ షెడ్లను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బోయిన పద్మాకర్, పట్టణ అధ్యక్షుడు జిట్టవేణి అరుణ్, బీజేపీ సీనియర్ నాయకుడు సిరికొండ శ్రీనివాస్, ఆంకారి సుధాకర్, మాజీ కౌన్సిలర్ అరవ లక్ష్మి, విద్యాసాగర్, కిషోర్‌సింగ్ తదితరులు ఉన్నారు.

ఏషియన్ పవర్ లిఫ్టింగ్‌లో విద్యార్థిని సత్తా

ధర్మపురి: మండలంలోని నక్కలపేటకు చెందిన భూక్య శ్రావణి ఈనెల 5 నుంచి 12 వరకు డెహ్రాడూన్‌లో నిర్వహించిన ఏషియన్ చాంపియన్‌షిప్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటింది. భారతదేశానికి ప్రాతినిథ్యం వహించి 52 కిలోల విభాగంలో స్క్వాడ్ 105, బెంచ్ ప్రెస్ 50 కిలోలు, డెడ్ లిఫ్టు 115 మొత్తం 270 కిలోల బరువునెత్తి కాంస్యం మెడల్ సాధించింది. మండలంలోని మగ్గిడి మోడల్ స్కూల్‌లో శ్రావణి ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శ్రావణి మెడల్ సాధించడంపై ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ పద్మ, కోచ్ రాజేందర్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

హైస్కూల్‌లో స్టేజీ నిర్మాణానికి భూమిపూజ

మల్లాపూర్: మండల కేంద్రంలోని స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో స్టేజీ గద్దె ప్లాట్‌ఫాం నిర్మాణానికి 1999–2000 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి పూర్తి చేసి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రజతోత్సవ వేడుకలను నిర్వహించుకున్నారు. పాఠశాలకు రూ.1.30లక్షల విరాళంతో స్టేజీ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

బుగ్గారం: మండలంలోని మద్దునూర్ సమీపంలోని గండి హన్మండ్లు ఆలయం వద్ద గంజాయి విక్రయిస్తున్న యువకులను పట్టుకుని వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ధర్మపురికి చెందిన తుమ్మ ఉపేందర్ అనే యువకుడు శుక్రవారం గండి సమీపంలో గంజాయి విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేయగా, ఉపేందర్ ఆదిత్య, నవీన్ అనే ఇద్దరు యువకులకు గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నారు. వారి నుంచి 60 గ్రాములు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. యువకులను పోలీసులు అదుపులోకి విచారిస్తున్నట్లు తెలిపారు. గంజాయి క్రయ విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

బావిలో పడి వృద్ధురాలు మృతి

రాయికల్: పట్టణానికి మామిడి రాజుబాయి (85) అనే వృద్ధురాలు మృతదేహం శుక్రవారం గ్రామ శివారులోని కనికరపు స్వామి వ్యవసాయ బావిలో లభ్యమైనట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. రాజుబాయికి గత కొంతకాలంగా మతిస్థిమితం లేదు. ఈనెల 5న ఇంట్లోంచి వెళ్లిపోగా కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు. గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో మృతదేహం లభ్యమైంది. మృతురాలి మనుమడు మామిడి సంజీవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనం కోసం వచ్చిన భక్తుడు పోగొట్టుకున్న పర్సు పోగొట్టుకోగా, ఏఎస్సై రమణారెడ్డి తిరిగి ఆ భక్తుడికి అప్పగించారు. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం పులిమడుగుకు చెందిన బానోత్ రవీందర్ ఈ నెల 5న కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు వచ్చి, తన పర్సును పోగొట్టుకున్నాడు. దీంతో ఏఎస్సై భక్తుడి పర్సును వెతికి, పర్సులోని ఆధార్‌కార్డు ఆధారంగా అడ్రస్ కనుక్కుని, శుక్రవారం భక్తుడికి పర్సుతోపాటు పర్సులోని పాన్‌కార్డు, రూ.900 నగదు, ఆధార్‌కార్డును అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి భక్తుడు కృతజ్ఞతలు తెలిపారు.